# భారతదేశంలో న్యాయ సమీక్షాధికారం, పరిశీలన

## న్యాయ సమీక్ష సిద్ధాంత పుట్టుక

★ **కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించిన శాసనాలు రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఉంటే, వాటిని కొట్టివేసే అధికారాన్ని న్యాయ సమీక్షాధికారం అని అంటారు. పార్లమెంటు రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మార్చే ప్రయత్నం చేస్తే, దాని రాజ్యాంగబద్ధతను నిర్ణయించే అధికారం సుప్రీం కోర్టుకు ఉంది. న్యాయ సమీక్ష అంటే రాజ్యాంగాధికారాన్ని రక్షించే ఒక ప్రక్రియ. సమాజంలోని వివిధ వర్గాల ఆసక్తులనుబట్టి కాకుండా రాజ్యాంగ స్ఫూర్తితో తీర్పులు ఉండాలనేది న్యాయ సమీక్ష ఉద్దేశం.**

★ న్యాయ సమీక్షాధికారం మొదటగా అమెరికాలో మార్బరీ, మాడిసన్‌ల వివాదంతో 1803లో ఉనికిలోకి వచ్చింది. అమెరికా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన యు.ఎస్. మార్షల్‌ను ఈ సిద్ధాంతానికి మూల పురుషుడిగా చెప్పవచ్చు.

★ యు.ఎస్. మార్షల్ అభిప్రాయం ప్రకారం 'చట్టాన్ని నిర్వచించే అధికారం న్యాయశాఖకు ఉంది. అసలు చట్టం అంటే ఏమిటో చెప్పాల్సిన గురుతర బాధ్యత న్యాయశాఖదే. రాజ్యాంగ చట్టాలను దృష్టిలో ఉంచుకుని, శాసన సభ చేసే చట్టాలను పరిశీలించి, అవి రాజ్యాంగానికి విరుద్ధంగా ఉన్నప్పుడు వాటిని కొట్టివేసే అధికారం న్యాయస్థానాలకు ఉండాలి'.

★ న్యాయ సమీక్షాధికారాన్ని అమెరికా సుప్రీం కోర్టు రూపొందించింది. అమెరికాలో సుప్రీం కోర్టు ప్రధాన కర్తవ్యం రాజ్యాంగాన్ని వ్యాఖ్యానించడం. ఈ గురుతర బాధ్యతను నిర్వహించడంలో అవసరమైతే రాష్ట్ర శాసన సభ లేదా కాంగ్రెస్ రూపొందించిన చట్టాన్ని రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించడానికి న్యాయస్థానం వెనుకాడదు. కానీ, విచిత్రమేమిటంటే న్యాయ సమీక్షాధికారం అమెరికా రాజ్యాంగంలో ఎక్కడా కనిపించదు.

## న్యాయ సమీక్ష అవసరం

★ రాజ్యాంగ ఆధిక్యాన్ని కాపాడటానికి, రాజ్యాంగాన్ని వ్యాఖ్యానించడానికి, సంరక్షించడానికి, ప్రాథమిక హక్కులను పరిరక్షించడానికి, సమాఖ్య సమతౌల్యాన్ని కాపాడటానికి, ప్రభుత్వ అధికార దుర్వినియోగం నుంచి ప్రజలను రక్షించడానికి న్యాయ సమీక్షాధికారం అవసరం.

## భారతదేశంలో న్యాయ సమీక్షాధికారం

★ న్యాయశాఖపై రాజ్యాంగ పరిషత్ నియమించిన అడ్‌హాక్ కమిటీ మొదటి సిఫారసు ప్రకారం సుప్రీం కోర్టుకు న్యాయ సమీక్షాధికారాన్ని సంక్రమింపజేయాలి. కార్యనిర్వాహకవర్గ చర్యలు, శాసన నిర్మాణ శాఖ చట్టాల్లో రాజ్యాంగబద్ధతను సుప్రీం కోర్టు సమాఖ్య వ్యవస్థలో అవసరమయ్యే విధంగా నిర్ణయిస్తుంది.

★ 'ప్రాథమిక హక్కుల పరిరక్షణకు యథావిధి ప్రక్రియను (Due process of law) పాటించడానికి చట్టానికి అధికారం అవసరం. నిజానికి చట్టపు యథావిధి ప్రక్రియ కంటే, న్యాయ సమీక్షాధికారం చాలా ఉపయోగకరం' అని కె.ఎం. మున్షీ అభిప్రాయపడ్డారు.

★ భారత రాజ్యాంగంలో ఎక్కడా న్యాయ సమీక్ష అనే పదం కనిపించదు. భారత రాజ్యాంగంలోని 13 వ అధికరణ ప్రకారం భారత పౌరుల ప్రాథమిక హక్కులకు భంగం కలిగించే చట్టాలు రాజ్యాంగ విరుద్ధమని న్యాయ సమీక్ష ద్వారా సుప్రీం కోర్టు, రాష్ట్రాల హైకోర్టులు ప్రకటిస్తాయి.

★ రాజ్యాంగంలోని అనేక ప్రకరణలు (32, 131, 132, 133, 134, 135, 136, 145, 246, 256) సుప్రీం కోర్టుకు న్యాయ సమీక్షాధికారాన్ని కలగజేస్తున్నాయి. శాసన సభ చట్టాన్ని కానీ, కార్యనిర్వాహక ఉత్తర్వుల రాజ్యాంగబద్ధతను కానీ సుప్రీం కోర్టులో సవాల్ చేయడానికి మూడు కారణాలు ఉండాలి. అవి:

ఎ) ప్రాథమిక హక్కులకు వ్యతిరేకంగా ఉండటం

బి) దాన్ని రూపొందించిన అధికార మాన్యత తీరు

సి) అది రాజ్యాంగ అంశాలకు విరుద్ధంగా ఉండటం

★ పై అంశాలను పరిశీలిస్తే, భారతదేశంలోని న్యాయ సమీక్షాధికార పరిధి అమెరికా న్యాయ సమీక్షాధికార పరిధి కంటే తక్కువగా ఉంటుంది. అమెరికా రాజ్యాంగం చట్టం అమలు ప్రక్రియను (Due process of law) గుర్తించింది. భారత రాజ్యాంగం చట్టం నిర్దేశించిన పద్ధతిని (Procedure established by law) గుర్తించింది.

★ వీటి మధ్య రెండు తేడాలున్నాయి. చట్టం అమలు ప్రక్రియ ద్వారా పౌర హక్కులను కాపాడటానికి సుప్రీం కోర్టుకు విస్తృత పరిధి ఉంటుంది. దీని ద్వారా న్యాయస్థానం హక్కులకు భంగం కలిగించే చట్టాలను సిద్ధాంతపరంగా పరిశీలించడంతోపాటు, అహేతుకమైన (unreasonable) కారణాలతో ఉన్న కార్యవిధానాలను కూడా పరిశీలిస్తుంది. అయితే ఒక చట్ట రాజ్యాంగబద్ధతను నిర్ణయించడానికి సిద్ధాంతపరమైన అంశాలను మాత్రమే మన సుప్రీం కోర్టు పరిశీలిస్తుంది. అంటే, ఆ చట్టం సంబంధిత అధికార పరిధిలో ఉందా లేదా అని మాత్రమే పరిశీలిస్తుంది. ఆ చట్టం ఏర్పాటులో ఉన్న సమంజసత్వం, యుక్తత లేదా విధానపరమైన అంతరాలను అది పరిశీలించకపోవచ్చు.

★ అమెరికాలో చట్టం అమలు ప్రక్రియ అనే అంశం ద్వారా అమెరికా సుప్రీం కోర్టుకు విస్తృతమైన అధికారాలు ఏర్పడ్డాయి. దీన్ని శాసన సభలో థర్డ్ ఛాంబర్, సూపర్ లెజిస్లేచర్, సామాజిక విధానానికి మధ్యవర్తి ఇలా అనేక విధాలుగా అభివర్ణించారు. అయితే మన రాజ్యాంగంలో అమెరికాలో మాదిరిగా న్యాయశాఖ ఔన్నత్యాన్ని గుర్తించారు కానీ, అది పరిమితంగానే జరిగింది.

## 24 వ రాజ్యాంగ సవరణ చట్టం (1971)

★ రాజ్యాంగంలో 13 (4) క్లాజ్‌ను చేర్చారు. దీని ప్రకారం రాజ్యాంగ సవరణ చట్టాలు 13 (2) లో పేర్కొన్న 'చట్టం' పరిధిలోకి రావు.

★ ఈ రాజ్యాంగ సవరణ చట్టాల ద్వారా పార్లమెంటుకి ప్రాథమిక హక్కులను కుదించడానికి, తీసివేయడానికి అధికారం ఉందని పేర్కొంది.

## 25 వ రాజ్యాంగ సవరణ చట్టం (1971)

★ రాజ్యాంగంలో 31C అనే కొత్త ప్రకరణను చేర్చారు. దీనిలో రెండు అంశాలు ఉన్నాయి.

1) 14వ ప్రకరణ (చట్టం ముందు సమానత్వం, చట్టం వల్ల సమాన రక్షణ) లేదా

19వ ప్రకరణ (భావ వ్యక్తీకరణ, సమావేశం... మొదలైన ఆరు హక్కుల రక్షణ) లేదా

31వ ప్రకరణ (ఆస్తి హక్కు) లో ఉన్న ప్రాథమిక హక్కులకు వ్యతిరేకంగా ఉన్నాయని 39 (b) లేదా 39 (c) ల్లో పేర్కొన్న సామ్యవాద, ఆదేశిక సూత్రాలను అమలుపరచడానికి ఉద్దేశించిన ఏ శాసనం చెల్లుబాటు కానట్లు భావించరాదు.

గమనిక: 39 (b) - దేశంలోని వనరులు, వాటి పంపిణీ, యాజమాన్యం సమాజ అభివృద్ధికి దోహదపడేలా నిర్వహించాలి.

★ 39 (c) - ఆర్థిక, ఉత్పాదక వనరులు కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతం కాకుండా చర్యలు తీసుకోవాలి.

2) ఆ శాసనంలో అది ఈ విధానాన్ని అమలు పరచడం కోసమే అని ప్రకటన ఉంటే, అలాంటి విధానాన్ని అమలు పరచలేదు అనే కారణంపై ఏ న్యాయస్థానంలో కూడా దాన్ని ప్రశ్నించరాదు. (No law containing a declaration for giving effect to such policy shall be questioned in any court on the ground that it does not give effect to such policy.)

## 26 వ రాజ్యాంగ సవరణ చట్టం (1971)

★ రాజ భరణాలను, భారత స్వదేశీ సంస్థానాల రాజులకు ఉన్న ప్రత్యేక హక్కులను రద్దు చేశారు.

## ప్రాథమిక హక్కులు Vs ఆదేశిక సూత్రాలు

### న్యాయ సమీక్ష - వివాదాంశాలు (లేదా) రాజ్యాంగ మౌలిక స్వరూపం

★ రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తర్వాత సుప్రీం కోర్టు న్యాయ సమీక్షాధికారాన్ని మొదటగా 1950 లో వినియోగించి, ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టంలో కొన్ని అంశాలను రాజ్యాంగ వ్యతిరేకమని తీర్పు (ఎ.కె. గోపాలన్ Vs తమిళనాడు ప్రభుత్వం 1950) చెప్పింది. ముఖ్యంగా ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాల మధ్య వివాదాలు ఏర్పడినప్పుడు, శాసన కార్యనిర్వాహక శాఖలు తమ అధికార విధులను విస్మరించి, మితిమీరి వ్యవహరిస్తే వాటి నియంతృత్వ ధోరణులను అనేక కేసుల్లో తన న్యాయ సమీక్షాధికారంతో సుప్రీంకోర్టు నియంత్రించగలిగింది.

### చంపకం దొరైరాజన్ Vs మద్రాసు రాష్ట్రం (1951)

★ ఈ కేసులో మద్రాసు ప్రభుత్వం వెనుకబడిన వర్గాలకు విద్యాసంస్థల్లో రిజర్వేషన్ కల్పిస్తూ తయారుచేసిన ఆర్డర్‌ను సుప్రీం కోర్టు

కొట్టివేసింది. ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలకు మధ్య సంఘర్షణ ఏర్పడితే, మొదటివే వర్తింపదగినవని తీర్పు ఇచ్చింది. ఆదేశిక సూత్రాలు ప్రాథమిక హక్కులకు అనుబంధంగా ఉండాలని పేర్కొంది. అయితే రాజ్యాంగ సవరణ చట్టాల ద్వారా ప్రాథమిక హక్కులను సవరించుకోవచ్చని తీర్పు చెప్పింది.

★ సుప్రీం కోర్టు తీర్పు రాజ్యాంగంలోని 37, 46 నిబంధనల వెనుక స్ఫూర్తిని దృష్టిలో ఉంచుకోలేదని విమర్శలు వచ్చాయి. ఈ కారణంగా మొదటి రాజ్యాంగ సవరణ చట్టం (1951), 4 వ రాజ్యాంగ సవరణ చట్టం (1955), 17 వ రాజ్యాంగ సవరణ చట్టం (1964) లను కొన్ని ఆదేశిక సూత్రాల అమలు కోసం రూపొందించారు.

★ మొదటి రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా భూసంస్కరణలకు సంబంధించిన అంశాలను 9 వ షెడ్యూల్‌లో చేర్చారు. 9 వ షెడ్యూల్‌లో చేర్చిన అంశాలు న్యాయ సమీక్ష పరిధిలోకి రావు. 4 వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా భారత, రాష్ట్ర ప్రభుత్వాలు స్వాధీనం చేసుకున్న ఆస్తులపై ఇచ్చే నష్టపరిహారాన్ని కోర్టుల పరిధి బయటే ఉంచారు.

★ 17 వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా వ్యక్తుల సొంత వ్యవసాయ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నప్పుడు ఆ భూమి మార్కెట్ విలువను పరిహారంగా సొంతదారునికి చెల్లించాలి. 9 వ షెడ్యూల్‌లో మరో 44 చట్టాలను చేర్చారు.

### శంకరీ ప్రసాద్ Vs యూనియన్ ఆఫ్ ఇండియా (1951)

★ ఆస్తి హక్కుని కుదించిన మొదటి రాజ్యాంగ సవరణ చట్ట రాజ్యాంగబద్ధ ఔచిత్యాన్ని ఈ కేసులో సవాల్ చేశారు.

★ 368 వ ప్రకరణం ప్రకారం పార్లమెంటుకు రాజ్యాంగ సవరణ అధికారం దృష్ట్యా ప్రాథమిక హక్కులను సవరించే అధికారం కూడా ఉంటుందని సుప్రీం కోర్టు ఈ కేసులో తీర్పు చెప్పింది.

★ 13 వ ప్రకరణలోని 'చట్టం' అనే పదం సాధారణ చట్టాలకే వర్తిస్తుందని, అది రాజ్యాంగ సవరణ చట్టాలకు వర్తించదని కోర్టు అభిప్రాయపడింది. కాబట్టి, రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా పార్లమెంటుకు ప్రాథమిక హక్కులను కుదించే లేదా తీసివేసే అధికారం ఉంటుంది.

★ ఇది 13 వ ప్రకరణంలోని 'చట్టం' పరిధిలోకి రాదు (ప్రకరణం 13 (2) ప్రకారం, ప్రాథమిక హక్కులను హరించే లేదా పరిమితం చేసే 'చట్టాలు', ఆదేశాలు చెల్లవు). 1965 లో సజ్జన్‌సింగ్ Vs స్టేట్ ఆఫ్ రాజస్థాన్ వివాదంలో కూడా పార్లమెంటుకు ప్రాథమిక హక్కులను సవరించే అధికారం ఉందని సుప్రీం కోర్టు తీర్పు చెప్పింది.

### గోలక్‌నాథ్ Vs పంజాబ్ రాష్ట్రం (1967)

★ ఈ కేసులో సుప్రీం కోర్టు తాను ఇంతకు ముందు ఇచ్చిన తీర్పుకి విరుద్ధమైన తీర్పునిచ్చింది. కొన్ని రాష్ట్ర చట్టాలను తొమ్మిదో షెడ్యూల్‌లో పొందుపరిచిన 17 వ రాజ్యాంగ సవరణ చట్టం (1914) రాజ్యాంగబద్ధతను ఈ కేసులో సవాల్ చేశారు.

★ ప్రాథమిక హక్కులు ఎంతో 'ఉన్నతమైనవి, స్థిరమైనవి' కాబట్టి, పార్లమెంటుకు ఈ హక్కులను కుదించే, తీసివేసే అధికారాలు లేవని సుప్రీం కోర్టు ఈ కేసులో తీర్పు ఇచ్చింది.

★ రాజ్యాంగ సవరణ చట్టం కూడా 13 వ ప్రకరణంలోని 'చట్టం' కు వర్తిస్తుందని, కాబట్టి, ప్రాథమిక హక్కులకు భంగం కలిగించే ఏ శాసనం కూడా చెల్లుబాటుకాదని సుప్రీం కోర్టు ఈ కేసులో ప్రకటించింది.

★ గోలక్‌నాథ్ కేసులో సుప్రీం కోర్టు సామాజిక ఆర్థిక న్యాయానికి విరుద్ధంగా హక్కులకు మద్దతిచ్చింది. కానీ రాజ్యాంగ ప్రవేశిక మాత్రం స్వేచ్ఛ కంటే, తులనాత్మకంగా సామాజిక, ఆర్థిక న్యాయాలు గొప్పవని పేర్కొంటోంది.

★ ఈ సందర్భంలోనే శ్రీమతి ఇందిరా గాంధీ రాజ భరణాలను, బ్యాంకులను జాతీయం చేస్తూ రెండు చట్టాలను చేశారు. వీటిని కూడా సుప్రీం కోర్టు కొట్టివేసింది. 1971 లో ఇందిరా గాంధీ మధ్యంతర ఎన్నికలను నిర్వహించి, అత్యధిక మెజారిటీ సంపాదించిన తర్వాత, పార్లమెంటు ఔన్నత్యాన్ని కాపాడటానికి 24, 25, 26 రాజ్యాంగ సవరణ చట్టాలను (1971) చేశారు.

రచయిత: షేక్ పీర్ సాహెబ్